వ్యాధుల కాలం.. జర పైలం

- వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న జ్వరాలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేని మందులు, వైద్య సిబ్బంది
- సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరమంటున్న వైద్యులు

వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న ఇబ్రహీంపట్నం ఏరియా ఆస్పత్రి

ఇబ్రహీంపట్నం, జూన్ 14 : వానలు ప్రారంభమయ్యాయి.. వాతావరణ మార్పుల కారణంగా అనేక సమస్యలు చుట్టుముడుతున్నాయి.. ఈ సమయంలో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉంటాయి.. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఈ జ్వరాలతో చాలామంది ఇబ్బందులు పడే అవకాశముంది. కరోనా లక్షణాలను పోలిన విధంగా వైరల్ ఫీవర్ లక్షణాలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల భారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పదిరోజుల నుంచి వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇలా ఒక సీజన్ నుంచి మరో సీజన్‌లోకి ప్రవేశించే ముందు రకరకాల ఇన్‌ఫెక్షన్లు దాడి చేస్తాయి. వాతావరణం చల్లగా ఉండడంతో వైరస్‌లు పెరిగే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాల ప్రమాదం తీవ్రంగా ఉంటుంది. ప్రతి పది మందిలో నలుగురికి జలుబు, ఇద్దరికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వైరల్ జ్వరాలు అకస్మాత్తుగా సోకుతాయి. తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి 102 డిగ్రీల జ్వరం ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పుల మధ్య రోగి నిసత్తువగా మారిపోతారు. కొందరిలో ఒంటిపై దుద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. మరికొందరిలో జలుబు తదితర లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వేధిస్తుంటాయి. సాదారణంగా వీటిని విషజ్వరాలు అంటారు. వాటంతట అవే తగ్గిపోయే సాదారణ వైరల్ జ్వరాలు కూడా కొన్ని ఉన్నాయి. తప్పనిసరిగా చికిత్స తీసుకోవాల్సిన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వైరల్ ఫీవర్ కిందకే వస్తాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అన్ని రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యాధులను అరికట్టేందుకు కృషి చేసింది. ముఖ్యంగా పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం కింద చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు దోమలు, ఈగలు విజృంభించకుండా కట్టడి చర్యలు తీసుకోవడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యాధులను పూర్తిగా నివారించగలిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల పారిశుధ్య వ్యవస్థపై దృష్టి సారించకపోవడంతో ఆరంభంలోనే ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచేందుకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వైరల్ ఫీవర్ ఇన్‌ఫెక్షన్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతుంది.
- ఆహారం షేర్ చేసుకోకపోవడం మంచిది.
- చల్లదనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వానలో వెళ్తే గొడుగు, రెయిన్‌కోట్స్ తప్పనిసరిగా వాడాలి.
- కాచి, చల్లార్చిన నీటిని తాగాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి.
- పిల్లలకు పండ్లు ఎక్కువగా తినిపించాలి, నూనె పదార్థాలు ఎక్కువగా వాడొద్దు.
- వానలో తడిసినప్పుడు జలుబు, గొంతునొప్పి, తదితర వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

వైరల్ ఫీవర్ రావడానికి కారణం..

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు కూడా వైరల్ ఫీవర్స్ విజృంభిస్తాయి. చల్లదనం తీవ్రత పెరగడంతో రక్త నాళాలు కుచించుకుపోతాయి. దీంతో రక్త సరఫరా నెమ్మదిస్తుంది. రక్తంలో ఉండే తెల్లరక్త కణాలు సంఖ్యా క్రమంగా తగ్గడంతో శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు, పిల్లల్లో చాలా త్వరగా వ్యాప్తి చెందే అవకాశము ఉంది. ఈ సమయంలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలి. ఇంటి ఆవరణలో పూల తొట్లలో నిలిచిపోయిన నీటిని తొలగించడంతో పాటు పాత టైర్లు, పాత డబ్బాల్లో నిలిచి ఉన్న నీటిని తొలగించాలి. ఇంటి పరిసరాల్లో దోమలు విజృంభించకుండా సరైన జాగ్రత్తలు పాటించాలి.

ముందు చూపులేని వైద్యారోగ్యశాఖ..

ఓవైపు వర్షాలు కురుస్తూ... సీజనల్ వ్యాధులు వస్తున్నా వైద్యారోగ్యశాఖ వ్యాధుల నివారణపై ఇప్పటివరకు దృష్టి సారించ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో రోగాల భారిన పడకుండా ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే వర్షాలు కురుస్తూ వ్యాధులు విజృంభిస్తున్నందున ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో పాటు సరైన మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

రోగాల నివారణకు చర్యలు చేపట్టాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి అవగాహన కార్యక్రమాల ద్వారా రోగాలు వ్యాప్తి చెందకుండా కృషి చేసింది. కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ఆస్పత్రులో సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. ప్రజలకు మెరుగైన చికిత్సల కోసం ప్రైవేటు ఆస్పత్రులను సంప్రదించాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వం స్పందించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. **- కృపేశ్, మాజీ ఎంపీపీ, ఇబ్రహీంపట్నం**

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

మోత్కూర్‌లో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం

దోమ, జూన్ 14 : సీఎం సహాయనిధి పేదలకు ఆరోగ్య భద్రత కల్పిస్తుందని మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూరుకు చెందిన అంజిలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందింది. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి చొరవతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సహకారంతో ఆమె వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.14,500 చెక్కును ఆమె భర్త లక్ష్మయ్యకు శనివారం మాజీ వైస్ ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్ రావు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు, సందయ్య, శేఖర్, కృష్ణయ్య, నరసింహులు, శేషయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 270 కేసులు పరిష్కారం

పరిగి: లోక్ అదాలత్‌లో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప

పరిగి, జూన్ 14 : పరిగిలోని కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 270 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అధ్యక్షతన నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ కేసులు 37, ఎక్సైజ్ 8, సీసీ అడ్మిషన్స్ 8, సైబర్ క్రైమ్ 35, పిటీ కేసులు 182 కలిపి మొత్తం 270 కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల ఆమోదంతో కేసులు పరిష్కరించామని జడ్జి నాగుల శిల్ప పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోశ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇబ్రహీం ఖాన్, ఏజీపీ బాలముకుందం, న్యాయవాదులు లింగం, ఆనంద్‌గౌడ్, విజయకుమార్, వెంకట్‌రెడ్డి, నర్సింహారావు, గౌస్‌పాషా, రాంచందర్, ఖైసర్ పాషా, భాస్కర్, శివారెడ్డి, వెంకటేశ్, కోర్టు సిబ్బంది మోహన్, తదితరులు పాల్గొన్నారు.

46 కేసులు..

బొంరాస్‌పేట : బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 46 కేసులను పరిష్కరించారు. శనివారం కొడంగల్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మొదటి తరగతి న్యాయమూర్తి బానోత్ శ్రీరాం సమక్షంలో 11 బీఎన్ఎస్ కేసులు, 35 మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. లోక్ అదాలత్ ద్వారా చిన్నచిన్న కేసులను ఇరు వర్గాల వారు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వికారాబాద్, జూన్ 14 :పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఆపదలో ఉన్న వారికి మీరు ఇచ్చే రక్తం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, అభిషేక్, రెహాన్, సిద్ధు, రవి, ఫైజల్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అడవుల రక్షణతోనే పర్యావరణం సురక్షితం

సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో రాజేందర్

యాలాల, జూన్ 14 : అడవులు, వన్యప్రాణుల రక్షణతోనే పర్యావరణం సురక్షితంగా ఉంటుందని ధారూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బాణాపూర్‌లో అడవుల రక్షణ వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ... అడవులను నరికి వేస్తే పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. అడవిలోనికి రాత్రుల సమయంలో జేసీబీలు, ట్రాక్టర్లు, డోజర్లు తీసుకెళ్లి అడవిని నాశనం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అడవి రక్షణ వాచర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తాం

కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 14 : వర్షానికి ఇల్లు కూలిపోయిన బాధిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగి పట్టణంలోని 8వ వార్డులో సమీనాబేగం ఇల్లు వర్షానికి కూలిపోవడంతో శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. మహిళా సంఘం ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. అనంతరం పరిగి పట్టణంలో బడిని మధ్యలో మానేసిన విద్యార్థులను విద్యా శాఖ అధికారులతో మాట్లాడి మైనార్టీ గురుకులంలో చేర్పించారు. పట్టణంలో ఆలయాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబయ్య, ఎర్రగడ్డపల్లి క్రిష్ణ, పాలాది శ్రీనివాస్, చిన్న నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన తాండూరు విద్యార్థి

- ఆల్ ఇండియాలో 660వ ర్యాంకు
- అభినందించిన తల్లిదండ్రులు, బంధుమిత్రులు

నీటిలో ఉత్తమ ర్యాంకు సాధించిన హరీశ్‌గౌతమ్‌ను అభినందిస్తూ స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

తాండూరు, జూన్ 14: దేశ వ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాల్లో తాండూరు నియోజకవర్గానికి చెందిన విద్యార్థి హరీశ్‌గౌతమ్ సత్తా చాటాడు. జాతీయ స్థాయిలో 660వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. తాండూరు పట్టణంలోని మిత్రనగర్ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీకాంత రావు, విద్యారాణి కుమారుడు హరీశ్‌గౌతమ్ ఇటీవల నీట్ పరీక్షకు హాజరయ్యాడు. తాజాగా విడుదలైన ఫలితాల్లో హరీష్ గౌతమ్ జాతీయ స్థాయిలో 660వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 416వ ర్యాంకు సాధించాడు. అన్ని సబ్జెక్టుల్లో 99శాతానికి పైగా ఉత్తీర్ణతతో 614 మార్కులు సాధించడం విశేషం. ఇదిలా ఉండగా హరీష్ గౌతమ్ తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. నీట్‌లో హరీశ్‌గౌతమ్ సాధించిన ఘనతకు తల్లిదండ్రులతో పాటు బంధుమిత్రులు అభినందించారు.

దళిత నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కొడంగల్, జూన్ 14 : దళిత ప్రజా సంఘాల నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం శనివారం కేవీపీస్, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం, అంబేద్కర్ సంఘం, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొడంగల్ పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సా చంద్రయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం కొత్తూరు చంద్రయ్య, కొడంగల్ అంబేద్కర్ సంఘం యూ. రమేశ్‌బాబు, డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సొంత గ్రామం బెల్కటూర్‌లో దళితులకు ఆలయ ప్రవేశం లేకపోవడం, దళిత యువకుడు పెండ్లి చేసుకుని బారాత్ నిర్వహిస్తుండగా అగ్రకులస్తులు దాడులు నిర్వహించడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రేగడి మైలారం బాలప్ప, పర్సాపూర్ దొబ్బిలి ఇశ్వప్ప పొలంలో దౌర్జన్యంగా రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ జిల్లా నాయకులు లక్ష్మప్ప, డప్పు వెంకటయ్య, కేవీపీస్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కులకచర్ల, జూన్ 14 : రైతులు రైతు భరోసా కోసం ఈ నెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కులకచర్ల మండల వ్యవసాయ అధికారి వీరస్వామి తెలిపారు. వానాకాలంలో 2025 నుంచి పట్టాలు పొందిన రైతులు ఈ నెల 5 నుంచి దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. రైతులు సంబంధిత డాక్యుమెంట్లు అందజేయాలని తెలిపారు. రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తీసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో రైతు భరోసా పొందుతున్న వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

రేపు పంటల సాగుపై రైతులకు అవగాహన

నవాబుపేట, జూన్ 14 : మండల పరిధిలోని రైతులకు సోమవారం పంటల సాగుపై శాస్త్రవేత్తలు పలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారని తహసీల్దార్ బుచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చించలపేట, నవాబుపేట, ఎల్లకొండ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

ముజాహిద్ పూర్ ప్రాథశాలలో మొక్కలు నాటుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, జూన్ 14: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వద్ద 5మొక్కలు నాటడంతో పాటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోశ్, ఉపాధ్యాయులు రాఘవేందర్ రెడ్డి, శేఖర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో డెలివరీ..

కొడంగల్, జూన్ 14 : మండల పరిధిలోని చట్లపల్లి తండాకు చెందిన శ్రీవాణి శుక్రవారం రాత్రి అంబులెన్స్‌లో పండంటి బాబును ప్రసవించింది. పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వాహనంలో తాండూరు ఆస్పత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. అంబులెన్స్ సిబ్బంది వెంటనే వాహనంలోనే కాన్పు చేశారు. కాన్పు కష్టతరం కావడంతో సిబ్బంది రవీందర ప్రత్యేక చొరవ తీసుకుని డెలివరీ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

వీరశైవులు సంఘటితంగా ఎదగాలి

వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న వీర శైవ సంఘం సభ్యులు

కొడంగల్, జూన్ 14 : మహబూబ్‌నగర్‌లో ఈ నెల 16న నిర్వహించనున్న యుగ మాసోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరశైవ లింగాయత్ సభ్యులు కోరారు. శనివారం పట్టణంలోని జగద్గురు నిరంజన మఠంలో వైరశైవ సమాజ పట్టణ కమిటీ అధ్యక్షుడు జంగం శాంతికుమార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరశైవ సంఘం సభ్యులు సంఘటితంగా ఎదిగేందుకు కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఏపీలోని నలుగురు జగద్గురు పీఠాధిపతులు హాజరవుతున్నారని తెలిపారు. వీరశైవులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో జరిగే ఆది జగద్గురు పంచాచార్య యుగమాసోత్సవం, బసవేశ్వర జయంతోత్సవ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వీరశైవ ధార్మిక సేవారత్న అవార్డును బుక్క బాల ప్రకాశ్‌కు అందించనున్నారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు స్థలం అందించిన దాత శేరి బస్వరాజ్ పటేల్‌ను పట్టణ పురోహితులు గడ్డం చంద్రశేఖర్, బుక్క బాల ప్రకాశ్‌ను సంఘం సభ్యులు సన్మానించారు.

బైకుల చోరీ ముఠా అరెస్ట్

- 12 బైకులు, రూ.8వేలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రమణగౌడ్

చోరీ చేసిన బైకులు, నిందితులను చూయిస్తున్న పోలీసులు

చేవెళ్ల రూరల్, జూన్ 14 : ద్విచక్ర వాహనాలు దొంగిలించి.. నకిలీ ఆర్‌సీలు, నంబర్ ప్లేట్లతో విక్రయిస్తున్న ముఠాను శంకర్‌పల్లి పోలీసులు పట్టుకునన్నారు. శనివారం నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ శంకర్‌పల్లి పీఎస్‌లో ప్రెస్ మీట్ నిర్వహించి వివరాలు వెల్లడించారు. మెహిదిపట్నానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్ (42) వృత్తి రీత్యా డ్రైవర్. కొన్నాళ్ల క్రితం శంకర్‌పల్లిలోని డబుల్ బెడ్ రూం బ్లాక్‌లోకి షిఫ్ట్ అయ్యాడు. నాలుగు నెలల నుంచి శంకర్‌పల్లి, నార్సింగి, మెహిందీపట్న, అత్తాపూర్, గుడిమల్కాపూర్, కోటి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నాడు. ముందుగా తన బైక్‌పై షాపింగ్ మాల్స్, మార్కెట్ పార్కింగ్, పబ్లిక్ ప్లేసుల్లో పగలు, రాత్రి రెక్కీ చేసి ద్విచక్ర వాహనాలను గుర్తించేవాడు. బైక్‌ను చోరీ చేసి.. సేమ్ కలర్, సేమ్ కంపెనీకి సంబంధించి మరో వాహనం నంబర్ ప్లేట్, ఛాసిస్ నంబర్ ఫొటోలు తీసేవాడు. తర్వాత ఆర్‌టీఐకి సంబంధించిన ఎం వ్యాలెట్ యాప్ ద్వారా ఛాసిస్ నంబర్ ఎంటర్ చేసి ఆర్‌సీని డౌన్ లోడ్ చేసేవాడు. వీటి అధారంగా ఆర్‌సీ కార్డు తయారు చేసి.. ఆ నంబర్ ప్లేట్‌ను దొంగిలించిన వాహనానికి బిగించేవాడు. ఆ తర్వాత ఈ ఫొటోలను కొండాపూర్‌కు చెందిన బొల్లు నాగరాజు అలియాస్ రాజు (38)కు పంపేవాడు. నాగరాజు ఆ ఫొటోలను తన స్నేహితులు, బంధువులకు పంపించి.. ఆ వాహనాలు బ్యాంక్ సీజ్ చేసినవి, మార్టిగేజ్‌లో ఉన్నాయని చెప్పి తన కమీషన్ కలుపుకొని ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఇలా వాహన చోరీలకు సంబంధించి శంకర్‌పల్లి పీఎస్‌లో 4, నార్సింగి పీఎస్‌లో 2, కల్సుంపుర పీఎస్‌లో 2, గుడిమల్కాపూర్ పీఎస్‌లో 1, అత్తాపూర్ పీఎస్‌లో 2 కేసులు నమోదయ్యాయి. ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్న శంకర్‌పల్లి పోలీసులు శుక్రవారం రాత్రి నిందితులను అరెస్ట్ చేసి... వారి నుంచి 12 మోటార్ సైకిల్స్, రూ.8.వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు.

వెట్టి చాకిరీకి గురైన పశ్చిమ బెంగాల్ కూలీకి విముక్తి

ముర్ము (ఫైల్)

మాడ్గుల, జూన్ 14 : వెట్టి చాకిరీ చేస్తున్న ఓ కార్మికుడికి విముక్తి కలిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కాంగ్రెస్ నాయకుడు రామావత్ సంజీవ్ నాయక్.. ఆవుల షెడ్‌లో పని చేసేందుకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కోప్నా ముర్మును పనిలో పెట్టుకున్నాడు. నాలుగేండ్ల నుంచి పని చేస్తున్నా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శనివారం ముర్ము పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయమై సీఐ వేణుగోపాల్ రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆర్డీవో బాధితుడిని సొంత రాష్ట్రానికి పంపాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు మాడ్గుల తహసీల్దార్ వినయ్ సాగర్, సీఐ బాధితుడిని పశ్చిమ బెంగాల్‌కు వెళ్లడానికి తగు ఏర్పాట్లు చేశారు.